# ఇండియన్ ఎకానమీ

## నీతి ఆయోగ్ (NITI AAYOG)

- ★ భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన సమ్మిళిత అభివృద్ధికి, ఆర్థిక సంక్షేమ పథకాల ఆధారంగా ప్రణాళికలను తయారు చేసే ప్రధాన సంస్థ ప్రణాళికా సంఘం. దీని స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు.
- ★ ప్రణాళికా సంఘాన్ని 1950లో ప్రారంభించారు. అప్పటి నుంచి నీతి ఆయోగ్ ఏర్పాటు వరకు ఈ సంఘం దేశంలో అన్నిరంగాల అభివృద్ధికి తీవ్రమైన కృషి చేసింది. అయితే తన విధులను మారుతున్న కాలంతో మార్చుకోకపోవడంతో దాన్ని రద్దు చేశారు.
- ★ నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మింగ్ ఇండియా) అనే పేరుతో భారత ప్రభుత్వం 2015, జనవరి 1న ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్‌ను కేంద్ర మంత్రివర్గ తీర్మానం ఆధారంగా ఏర్పాటు చేశారు.
- ★ నీతి ఆయోగ్ కేవలం సలహా సంస్థ మాత్రమే. ఇది ప్రభుత్వ విధానాలను మార్గదర్శకాలను నిర్దేశించే మేధోపరమైన సలహా సంస్థగా దీన్ని రూపొందించారు.

### నిర్మాణం

- ★ నీతి ఆయోగ్ కూర్పు/ నిర్మాణం ఈ విధంగా ఉంటుంది.
- ★ దీనికి అధ్యక్షుడు భారత ప్రధానమంత్రి.
- ★ ప్రధాని నియమించే ఒక ఉపాధ్యక్షుడు ఉంటారు.
- ★ సభ్యుల్లో పూర్తికాలం పనిచేసే సభ్యులు, తాత్కాలిక సభ్యులు ఉంటారు. తాత్కాలిక సభ్యులుగా దేశంలోని ప్రధాన యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల నుంచి రొటేషన్ పద్ధతిలో ఇద్దరిని నియమిస్తారు.
- ★ ఎక్స్ – అఫీషియో సభ్యులుగా కేంద్ర మంత్రిమండలి నుంచి నలుగురు సభ్యులను ప్రధాని నియమిస్తారు..
- ★ ముఖ్య కార్య నిర్వహణాధికారి (CEO) గా భారత ప్రభుత్వ కార్యదర్శి స్థాయిలో ఉన్నవారిని ప్రధానమంత్రి నియమిస్తారు.
- ★ నీతి ఆయోగ్‌లోని పాలక మండలిలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు సభ్యులుగా ఉంటారు.
- ★ నీతి ఆయోగ్ కింద ఏర్పాటైన ప్రాంతీయ మండళ్లు కొన్ని రాష్ట్రాలకు లేదా ఒక ప్రాంతానికి సంబంధించి నిర్దిష్ట అంశాలను పరిశీలిస్తాయి.

### లక్ష్యాలు

- ★ కీలక విధాన నిర్ణయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక సలహాలను అందిస్తుంది.
- ★ వ్యవసాయదారుల ప్రయోజనాలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార భద్రతా అంశాలను సమ్మిళితం చేయడం.
- ★ ప్రపంచ సామాజిక, ఆర్థిక సమస్యల చర్చల్లో భారత్‌ను ప్రధాన పాత్రధారి చేయడం.
- ★ ఉత్పత్తి ప్రక్రియలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతి వర్గాన్ని సమర్థంగా ఉపయోగించడం.
- ★ ప్రవాస భారతీయుల్ని దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయడం.
- ★ మానవ వనరులను శాస్త్రీయ, మానవ మూలధనంగా మార్చడం.
- ★ సాంకేతికత ఆధారంగా పట్టణీకరణను అభివృద్ధి చేయడం.
- ★ పౌర భాగస్వామ్యం, సమాన అవకాశాల కల్పన.
- ★ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, భాగస్వాముల మధ్య, పరిశోధనా సంస్థల మధ్య, విజ్ఞానం, నవకల్పనలు, సమాచార వ్యవస్థ పెంచే వేదిక ఏర్పాటు చేయడం.



R-13-10-17

★ జాతీయ అభివృద్ధి భద్రతా ప్రయోజనాలు, వ్యూహాత్మక దీర్ఘకాల ప్రయోజనాల ఆధారంగా పరిశోధనాత్మక చర్యలు తీసుకోవడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచడం.

★ అభివృద్ధి పథకాలు అమలుకు పర్యవేక్షణ, విశ్లేషణ, సమర్థ వనరుల గుర్తింపు.

★ పై అంశాలు, లక్ష్యాల సాధనకు అవసరమైన ఇతర చర్యలు తీసుకోవడం.

**స్వభావం**

★ నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల మధ్య నిరంతర, నిజమైన భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేస్తుంది.

★ కేంద్ర, రాష్ట్రాలకు వ్యూహాత్మక, సాంకేతిక సలహాలు అందించే మేధో కేంద్రంగా రూపొందడానికి కృషి జరుగుతుంది.

★ రాష్ట్రాల అభివృద్ధి దేశ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలుపుతుంది.

★ సహకార సమాఖ్య వ్యవస్థను దేశంలో బలపరచడానికి, ప్రోత్సాహానికి కృషి చేస్తుంది. గ్రామ, ఉన్నత స్థాయి ప్రణాళిక మధ్య అనుసంధానం కోసం యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తుంది.

★ ఆర్థిక ప్రక్రియల ద్వారా సమ్మిళిత వృద్ధి సాధించడానికి కృషిచేస్తుంది.

★ నవకల్పనలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవస్థాపక మద్దతులను ఒప్పందాల ద్వారా సమకూరుస్తుంది.

★ ఆర్థికాభివృద్ధి సాధనకు వివిధ రంగాలు, శాఖల మధ్య పరిష్కార వేదికగా పనిచేస్తుంది.

★ ఉత్పాదక సామర్థ్య నిర్మాణాల సృష్టికి, వాటి అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది.

**ప్రధాన సూత్రాలు**

★ నీతి ఆయోగ్ లక్ష్యాల సాధనకు, విధుల నిర్వహణకు కింది ప్రధాన సూత్రాలు ఆధారంగా ఉన్నాయి. ప్రభుత్వ డాక్యుమెంట్ ప్రకారం... నీతి ఆయోగ్ అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేయాలి. ఇది 'సమ్మిళితం, సమానత్వం, సుస్థిరత' అనే అంశాల ప్రాతిపదిక.

★ నీతి ఆయోగ్ సాధికారత నిర్మాణం, మానవ గౌరవం, జాతీయ స్వయం గౌరవం అభివృద్ధి కోసం అనుసరించే వ్యూహాన్ని తెలపడానికి 'అన్ని రంగాలు, సమగ్ర అవగాహన, సమ్మిళితం, స్థూల భావన' అనే సూత్రాల ఆధారంగా అభివృద్ధి నమూనాను రూపొందించాలని పేర్కొంది.

**అంత్యోదయ**

★ వ్యక్తిగత స్థాయి వరకు అభివృద్ధి ఫలాలు తీసుకెళ్లే విధంగా విధాన రూపకల్పన చేయడం 'అంత్యోదయ' సూత్రం లక్ష్యం. దీని ఆధారంగా నీతి ఆయోగ్ విధాన రూపకల్పనకు ఈ సూత్రం దోహదం చేస్తుంది. (దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఈ భావనను తెలియజేశారు)

**సమ్మిళితం (Inclusiveness)**

★ సమ్మిళిత సూత్రం ఆధారంగా బలహీన వర్గాలను అభివృద్ధి చేయడం, దేశంలో అన్ని వర్గాలు లింగ, మత, ప్రాంత, తరగతి, కుల, భేదం లేకుండా అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడటం. దీని ఆధారంగా నీతి ఆయోగ్ తన విధులు నిర్వర్తిస్తుంది.

**గ్రామీణం (Village)**

★ అభివృద్ధి ప్రక్రియలో గ్రామాలను భాగస్వామ్యం చేయడం. నీతి ఆయోగ్ ఈ సూత్రం ఆధారంగా చేస్తుంది.

**డెమోగ్రాఫిక్ డివిడెండ్ (జనాభా వనరు)**

★ భారత్‌లో యువ జనాభా ప్రధాన ఆస్తిగా ఉంది. వీరి సంఖ్యను విద్య, నైపుణ్యాలు, సాధికారత ద్వారా అభివృద్ధి చేయడం నీతి ఆయోగ్ ప్రధాన లక్ష్యం.

**పౌర భాగస్వామ్యం (People Participation)**

★ అభివృద్ధి ప్రక్రియలో పౌర భాగస్వామ్యాన్ని పెంచి, ఆర్థికాభివృద్ధిలో ప్రవాస భారతీయులు, దేశీయులను భాగస్వాములను చేయటం ద్వారా సుపరిపాలనకు దోహద పడటం నీతి ఆయోగ్ లక్ష్యం.

**సుస్థిరత (Sustainability)**

★ పర్యావరణ రక్షణ, ప్రాచీన సంప్రదాయ నిర్మాణం, అభివృద్ధి ప్రక్రియలు లాంటి అంశాల్లో ప్రణాళికల్లో స్థిరత్వాన్ని, సుస్థిరతను కొన సాగించే విధానాలను నీతి ఆయోగ్ ఈ సూత్రం ద్వారా రూపొందిస్తుంది.

**పరిపాలన (Governance)**

★ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రగతిశీల విధానాల రూపకల్పన మొదలైన అంశాల్లో 'కేటాయింపులు, ఉత్పత్తులు, ఫలితాలు' అనే సూత్రాల ఆధారంగా విధానాలను నీతి ఆయోగ్ రూపొందిస్తుంది.

**ప్రత్యేక విభాగాలు**

★ ప్రభుత్వ డాక్యుమెంట్ ప్రకారం నీతి ఆయోగ్‌లో కింది ప్రత్యేక విభాగాలు ఉన్నాయి.

**పరిశోధనా విభాగం (Research Wing)**

★ ఈ విభాగంలో వివిధ రంగాలకు సంబంధించి అనుభవజ్ఞులు, పరిశోధకులు, వారి రంగాలవారీ పరిశోధనా అంశాలను తెలుపుతారు.

**సంప్రదింపుల విభాగం (Consultancy Wing)**

★ కేంద్ర రాష్ట్రాలకు అవసరమయ్యే అత్యున్నత ప్రత్యేక సేవలు, నిధులు, సలహాలు అందించడానికి నాణ్యత పరిశీలనను సంప్రదింపుల విభాగం పర్యవేక్షిస్తుంది.

**టీమ్ ఇండియా విభాగం**

★ నీతి ఆయోగ్‌లో ప్రతి రాష్ట్రం తరపున తమ వాదనలు, భావాలను వినిపించడానికి టీమ్ ఇండియా విభాగం ఉంటుంది. ఇది జాతీయ భాగస్వామ్యానికి దోహదం చేస్తుంది. దీనిలో ప్రతి రాష్ట్రం, ప్రతి శాఖ భాగస్వామిగా ఉంటాయి.

## విధులు

★ గ్రామ ప్రణాళిక యంత్రాంగాన్ని రూపొందించడం, అమలు, పర్యవేక్షణ.

★ ఆర్థిక వ్యూహాల్లో జాతీయ భద్రతా ప్రయోజనాలు ఉండేలా చూడటం.

★ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రయత్నించడం.

★ భారత్ సహకార, పోటీ సమాఖ్యగా పరివర్తన చెందడానికి కృషి చేయడం.

★ వికేంద్రీకృత ప్రణాళిక నమునాను ప్రవేశపెట్టడం.

★ జాతీయ, రాష్ట్రాల అభివృద్ధికి దూరదృష్టి, ఊహాత్మక ప్రణాళికలను తయారుచేయడం.

★ కేంద్ర, రాష్ట్రాలకు పరిశోధనా ఫలాలు అందించే మంచి విధానాలను విస్తృతంగా అందించడం.

★ విజ్ఞానం, నవకల్పనల కేంద్రంగా ఉండి, నిపుణులతో కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలకు విధానాలను రూపకల్పన చేయడం

★ అంతర రాష్ట్ర, రంగాల మధ్య వివాదాలు పరిష్కరించడం.

★ సత్వర, ఆర్థికాభివృద్ధికి సమగ్ర, సంపూర్ణమైన పద్ధతులు ప్రవేశపెట్టడం.

★ ప్రపంచ వనరులు, నైపుణ్యాల సమర్థ వినియోగాలను సమన్వయం చేసే సంస్థగా ఉండడం.

★ కేంద్ర రాష్ట్రాలకు పాలనా, విధాన నిర్ణయాలు, కార్యక్రమాలు, పథకాల రూపకల్పనకు సలహాదారుగా వ్యవహరించడం.

★ ఉత్పాదక శక్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వృద్ధి అదనంగా పెంచేలా దోహదం చేస్తుంది.

★ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలను పర్యవేక్షించి, సమీక్షించి ప్రభుత్వాలకు తెలపడం.

★ జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాల విషయంలో ఉమ్మడి అభివృద్ధి అజెండాకు ఆస్కారం కల్పిస్తుంది.

**విజయాలు**

- ★ నీతి ఆయోగ్ ప్రారంభం నుంచి ముఖ్యమైన అంశాల్లో సాధించిన విజయాలను అధికారికంగా విడుదల చేసింది. వాటిలో కొన్ని కింది విధంగా ఉన్నాయి.
- ★ డిజిటల్ చెల్లింపులకు ఊతం, వీటిని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం.
- ★ వ్యవసాయ భూముల లీజుల చట్టం – 2016 ను రూపొందించడం.
- ★ భారత వైద్య మండలి (MCI) చట్టాన్ని రద్దుచేసి వైద్య రంగ నియంత్రణకు కొత్త సంస్థ ఏర్పాటుకు సిఫారసు చేయడం. జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు కోసం ముసాయిదా చట్టాన్ని రూపొందించడం.
- ★ కేంద్ర ప్రాయోజిత పథకాలను హేతుబద్ధం చేయడం.
- ★ విద్య, వైద్యం, తాగునీరు లాంటి కీలక రంగాల్లో వార్షిక పురోగతి సాధిస్తూ, రాష్ట్రాలు ఒక దానితో ఒకటి పోటీ పడేందుకు కీలక సూచనలు చేయడం.

**రచయిత: దాసరి రాజేందర్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net